క్లుప్తంగా

అందరికీ నెగెటివ్‌

పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 17 మందికి కొవిడ్‌ ర్యాపిడ్‌ టెస్టులు నిర్వహించగా అందులో అందరికి నెగెటివ్‌ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్‌ తెలిపారు. 16 మందికి ఆర్టీపీసీఆర్‌ టెస్టులు చేసినట్లు చెప్పారు.

5న క్రికెట్‌ టోర్నమెంట్‌

శేరిలింగంపల్లి: పురం విశ్వకాంత్‌రెడ్డి మెమోరియల్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌ను వచ్చే నెల 5వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శేరిలింగంపల్లి లేగల క్రికెట్‌ గ్రౌండ్‌లో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనేందుకు నమోదు చేసుకోవాలన్నారు. ఫైనల్‌ మ్యాచ్‌ జూన్‌ 13వ తేదీ నిర్వహిస్తామన్నారు. విజేతకు రూ.50 వేల నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్‌ జట్టుకు రూ.25 వేల నగదును అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్‌ నంబర్స్‌ 9885755759, 9247924782లలో సంప్రదించాలన్నారు.

‘సండే ఈవినింగ్‌ టాక్‌’

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్‌ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం ‘సండే ఈవినింగ్‌ టాక్‌’ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ‘ఎక్స్‌పీరియన్సింగ్‌ హెల్దీ లైఫ్‌–ది నేచర్స్‌ వే’ అనే అంశంపై గుజరాత్‌కు చెందిన న్యాచురోపతి సీనియర్‌ కన్సల్టెంట్‌ బి.కె. డాక్టర్‌ లలిత్‌బాయ్‌ పంచాల్‌ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. కార్యక్రమంపై మరిన్ని వివరాలకు ఫోన్‌ నంబర్‌ 040–23001234లో సంప్రదించవచ్చు.

‘మనూ’లో డిబేట్‌, పాటల పోటీలు

రాయదుర్గం: మనూలో జీ–20 యూనివర్సిటీ కనెక్ట్‌ ప్రోగ్రామ్‌లో భాగంగా ఉపన్యాసం (డిబేట్‌), పాటల పోటీలను నిర్వహించారు. విజేతలను శుక్రవారం ప్రకటించారు. షోయాబుర్‌ రహమాన్‌, ఎండీ సోహ్రాబ్‌ ఆలమ్‌, ఎం.డీ యూసుఫ్‌ వరుసగా ఉర్దూ, హిందీ, ఇంగ్లిష్‌ భాషలలో ఉపన్యాస పోటీలలో విజేతలుగా కాగా పాటల పోటీలలో మహ్మద్‌ అర్బీన్‌ విజేతగా నిలిచారు. ఈ పోటీలను ముస్తాక్‌ అహ్మద్‌ పటేల్‌ పర్యవేక్షించారు. డాక్టర్‌ ఖైసర్‌మహ్మద్‌, డాక్టర్‌ ఫర్హత్‌అలీ, డాక్టర్‌ ఎండి.రషీద్‌ ఫారూఖీ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

వ్యాసరచనలో విజేతలు వీరే..

ఉర్దూ యూనివర్సిటీలో వ్యాస రచన పోటీలను ఉర్దూ, ఇంగ్లిష్‌, హిందీ భాషలలో వేర్వేరుగా నిర్వహించారు. అందులో ప్రతి భాషలో ముగ్గురిని విజేతలుగా ప్రకటించారు. అందులో ఇంగ్లిష్‌లో సహానా షెరీన్‌, ఫాహద్‌కలీక్‌, మహ్మద్‌ యూసుఫ్‌ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. హిందీ భాషలో బుష్రాఫాతిమా,టి మన్నన్‌, జియావుల్లా అన్సారీ, ఉర్దూ భాషలో అబ్దుల్‌ అజీమ్‌, మహ్మద్‌ అబ్దుల్లా, మజార్‌ సుబాని మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

‘మనూ’లో మరో కొత్త కోర్సు ప్రారంభం

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో మరో కొత్త కోర్సుకు శ్రీకారం చుడుతున్నారు. ఉర్దూ యూనివర్సిటీలోని సెంటర్‌ ఫర్‌ ఉర్దూ కల్చర్‌ స్టడీస్‌లో కొత్తగా పీహెచ్‌డీ కోర్సును అందిస్తోంది. ఈ కోర్సులో అడ్మిషన్ల కోసం ప్రత్యేకంగా ప్రవేశ పరీక్షను హైదరాబాద్‌ క్యాంపస్‌లో నిర్వహిస్తారు. ఉర్దూ సంస్కృతి, భాషా, సాంస్కృతిక పరిభాష, సామెతలు, ఉర్దూ సాహిత్యంలో సాంస్కృతిక వర్ణన, మిశ్రమ సంస్కృతి, బహుళ సాంస్కృతికత, జాతి వైవిధ్యం, భారతీయ సంస్కృతి, ప్రాంతీయ సంస్కృతి, ఇండో–ఇస్లామిక్‌ సంస్కృతి, జానపద సంస్కృతి, పట్టణ సంస్కృతి, గిరిజన సంస్కృతి, జానపద కళ, జానపద సాహిత్యం వంటి అంశాలు ఈ కోర్సులో ఉంటాయి. ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ 28. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలి.

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నాని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామచంద్రాపురంలోని ఎస్‌బీఎస్‌బీ అవతార్‌ అపార్ట్‌మెంట్‌వాసులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అపార్ట్‌మెంట్‌ ఆనుకుని ఉన్న ఓపెన్‌ నాలా కారణంగా అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. విద్యుత్‌ సమస్య, ఓటర్‌ కార్డులలో చిరునామా మార్చాలని వారు కోరారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను త్వరలో సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ పుష్పనగేష్‌, నాయకులు బూరుగడ్డ నగేష్‌, వెంకట్‌ రెడ్డి, పరమేష్‌ యాదవ్‌, లక్ష్మణ్‌ యాదవ్‌,రాజిరెడ్డి, పాండులు పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట

పటాన్‌చెరు టౌన్‌: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేసి వారికి ప్రాధాన్యం కల్పిస్తోందని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్‌ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌ రాష్ట్ర మత్స్యశాఖ ఫెడరేషన్‌ చైర్మన్‌ పిట్టల రవీందర్‌, శాసనమండలి వైస్‌ చైర్మన్‌ బండప్రకాష్‌ను నీలం మధు మర్యాదపూర్వకంగా కలసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.






శిల్పారామంలో ఏర్పాటు చేసిన ప్రకృతి రాగ పార్కులో ఆకట్టుకుంటున్న శిల్ప కళాకృతులు

ప్రకృతి రాగ పార్కు

శిల్పారామంలో ఉదయం 10.30 నుండి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో..





బండరాళ్లను అందమైన ఆకృతులుగా మార్చారు. ఒక్కో శిల్పం ఒకో అర్థాన్ని తెలిపే విధంగా మలిచారు. తల్లిబిడ్డల బంధం, దేవతామూర్తులు, ప్రేమానురాగాలు తెలిపే విధంగా, బంజారా ఫైర్‌క్యాంప్‌ , పల్లెటూరి జీవన విధానం తెలిపే విధంగా ఇలా వివిధ రకాల సందేశాన్ని తెలిపే ఆకృతులు తయారు చేశారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన ప్రకృతి రాగ పార్కు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. దాదాపు అర ఎకరాలో ఏర్పాటు చేసిన పార్కులో వివిధ రకాల శిల్పాలను ఏర్పాటు చేశారు. – మాదాపూర్‌

బోర్డులను ఏర్పాటు చేయాలి



ప్రకృతి రాగ పార్కులో ఏర్పాటు చేసిన శిల్పాల గురించి వివరించే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలి. శిల్పసంపద గూర్చి వివరించాలి. శిల్పారామం చాలా బాగుంది. మొదటి సారి వచ్చాను. ప్రకృతి రమణీయత, పచ్చదనం నడుమ ఏర్పాటు చేసిన ప్రకృతి రాగ పార్కును సందర్శించాను.

–సాయి, సందర్శకుడు

బంజారా ఫైర్‌క్యాంప్‌ అద్భుతం



పార్కులో ఏర్పాటు చేసిన విగ్రహాలు నచ్చాయి. బంజారా సంస్కృతి సాంప్రదాయాలను తెలిపే విధంగా కళాకారులు అద్భుతంగా రాళ్లతో మలిచారు. ఈసారి కుటుంబంతో కలసి వస్తాము. శిలా సంపద గూర్చి చిన్నారులకు తెలియజేసే సమాచారం ఏర్పాటు చేయాలి.

– వంశీకిషోర్‌, సందర్శకుడు

‘పొట్ట’ తిప్పలు పెరగనున్నాయ్‌..

- ఏఐజీ ఆసుపత్రి సర్వే వెల్లడి
- మారుతున్న ఆహారపు అలవాట్లే కారణం
- మైదా తదితర ప్రాసెస్డ్‌ ఉత్పత్తులకు దూరం కావాలి..

హఫీజ్‌పేట్‌ : రానున్న కాలంలో దేశంలో కడుపులో పలు రకాల సమస్యలు సృష్టించే ఇన్‌ఫ్లమేటరీ బొవెల్‌ డిసీజ్‌ (ఐబీడీ) వ్యాధి తీవ్రం కానుందని, ముందుగానే గుర్తిస్తే అరికట్టవచ్చని ఏఐజీ ఆసుపత్రి చైర్మన్‌ డాక్టర్‌ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో ప్రపంచ ఐబీడీ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహారపు అలవాట్లే ఐబీడీ వ్యాధికి కారణమవుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా అధ్యయనం చేపట్టామన్నారు. దీని ప్రకారం ఎవరైతే ప్రాసెస్డ్‌ ఫుడ్‌ అధికంగా వినియోగిస్తున్నారో, సమయానికి ఆహారం తీసుకోవడం లేదో, సరైన డైట్‌ అనుసరించడం లేదో వారు తరచుగా ఐబీడీ ఇబ్బందులకు గురవుతున్నట్లు గుర్తించామన్నారు. ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పుల కారణంగా ఈ వ్యాధి మన దేశంలోనూ విస్తరించిందన్నారు. పాతికేళ్ల క్రితం ఐబీడీ వ్యాధి పాశ్చాత్య దేశాలకు పరిమితమై ఉండేదన్నారు. ఐబీడీ రోగుల్లో 20శాతం మంది చిన్నారులు ఉన్నారని, అది వారి ఎదుగుదలపై ప్రభావం చూపిస్తూ తల్లిదండ్రుల్ని మానసికంగా ఇబ్బంది పెడుతోందన్నారు. ఈ నేపథ్యంలో సరైన ఆహారాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. నేషనల్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ న్యూట్రిషన్‌, ఇండియన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ మెడికల్‌ రీసెర్చ్‌ మాజీ డైరెక్టర్‌ డా.శశికిరణ్‌ మాట్లాడుతూ గోధుమ పిండి కూడా ఒక రకంగా ప్రాసెస్డ్‌ ఉత్పత్తి అయినప్పటికీ, అతిగా ప్రాసెస్‌ చేసిన కంపెనీ తయారీ బ్రెడ్స్‌, చిప్స్‌, మీట్స్‌ వంటివి మరింత ప్రమాదకారకాలన్నారు. మైదా, చక్కెర, ఉప్పు వంటి తెల్లటి ఉత్పత్తులను దూరంగా పెట్టడం అనేది సులభమైన నిబంధనగా అనుసరించాలన్నారు. దానికి బదులుగా రాక్‌ సాల్ట్‌, హోల్‌ వీట్‌... వంటివి వినియోగించాలన్నారు. ఆసుపత్రి ఐబీడీ సెంటర్‌ డైరెక్టర్‌ రూపా బెనర్జీ మాట్లాడుతూ ప్రస్తుతం ఏటా 15లక్షల మంది ఈ వ్యాధి బారిన పడుతున్నట్టు అంచనా వేస్తున్నామన్నారు. తరచు డయేరియా, అనూహ్యంగా వెయిట్‌లాస్‌, పొట్టలో, పొత్తికడుపులో నొప్పి, అలసట, మలద్వారంలో రక్తస్రావం...వంటివన్నీ ఐబీడీ దుష్పలితాలుగా వివరించారు. టీబీ సహా ఇతర జబ్బుల తరహాలో ఉండే లక్షణాల వల్ల దీన్ని గుర్తించడం తరచుగా కష్టతరమవుతోందని చెప్పారు. కార్యక్రమంలో సర్వే ఫలితాలతో పాటు ఐబిడి నివారణకు ఉపకరించేలా సరైన డైట్‌ని సూచించే గట్‌ ఫ్రెండ్లీ రెసిపీ బుక్‌ని కూడా విడుదల చేశారు.

మస్తాన్‌నగర్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర



మాదాపూర్‌: కొండాపూర్‌ డివిజన్‌ పరిధిలోని మస్తాన్‌నగర్‌ కాలనీలో సమస్యలు, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ అధికారులతో కలసి శుక్రవారం ఎమ్మెల్యే గాంధీ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. కాలనీవాసులు తెలిపిన సమస్యల గురించి అధికారులతో మాట్లాడారు. డ్రైనేజీ, మంచినీరు, రోడ్లు, వీధిదీపాలు, ఎలక్ట్రికల్‌ సంబంధిత సమస్యలను కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఈఈ శ్రీనివాస్‌, డీఈ రమేష్‌, ఏఈ జగదీష్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు ఎండి ఇబ్రహీం, సాయి కుమార్‌, రాజు, జాన్‌, సులేమాన్‌, ధనరాజు, వెంకటేష్‌, కార్తీక్‌, కాలనీవాసులు పాల్గొన్నారు.

గీతంలో జాతీయ పరిశోధనా సింపోజియం

పటాన్‌చెరుటౌన్‌: ఆర్కిటెక్చర్‌లో పరిశోధనను పెంపొందించడానికి జూలై 20, 21 తేదీలలో విద్యార్థుల కోసం నేషనల్‌ రీసెర్చ్‌ సింపోజియంను హైదరాబాద్‌లోని రుద్రారం గీతం స్కూల్‌ ఆఫ్‌ ఆర్కిటెక్చర్‌ నిర్వహించనుంది. ఈ విషయాన్ని సదస్సు నిర్వాహకురాలు ప్రొఫెసర్‌ కుర్రి స్రవంతి శుక్రవారం తెలిపారు. కళ, వాస్తు శిల్పం ద్వారా నగరాల గుర్తింపు, నిర్మాణ సంస్కృతి, వారసత్వ నిర్వహణ, పర్యావరణ సామర్థ్యం, స్థిరమైన భవిష్యత్‌, సమకాలీన నిర్మాణ పద్ధతులు, వాస్తు శిల్పంలో వైవిధ్యం వంటి ఇతివృత్తాలతో ఈ సింపోజియం నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్నవారు, జూన్‌ 12వ తేదీలోగా పరిశోధనా పత్రాలను సమర్పించాలని, వాటిపై వ్యాఖ్య లేదా ఆమోదాన్ని జూలై 1వ తేదీలోగా తెలియజేస్తామన్నారు. తుది సమర్పణ జూలై 10వ తేదీ అని చెప్పారు. బీఆర్క్‌, ఎంఆర్క్‌,, పీహెచ్‌డీ విద్యార్థులు ఈ సింపోజియంలో పాల్గొనడానికి అర్హులని, ఇందులో పత్ర సమర్పణ చేసేవారికి ఉచిత వసతితో పాటు 3 ఏసీ రైలు టిక్కెట్లు ఇస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం spaul@gitam.edu కు ఈ–మెయిల్‌ చేయాలని సూచించారు.

జలవనరులకు నష్టం కలిగిస్తే చర్యలు

పటాన్‌చెరు టౌన్‌: జలవనరులకు నష్టం కలిగిస్తే చర్యలు తప్పవని నీటిపారుదల శాఖ ఎస్‌ఈ ఆనంద్‌ అన్నారు. శుక్రవారం ఆయన ఇతర అధికారులతో కలసి పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని వెంచర్లను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. రెయిన్‌బో వెంచర్‌లో కట్టు కాలువ కబ్జా అయ్యిందని, అసలు కాలువను పునరుద్ధరించాలని ఆదేశించారు. ఇంకార్‌ వెంచర్‌లో కమిటీ ఇచ్చిన సూచనల మేరకు డ్రెయిన్‌ బాక్స్‌ నిర్మాణం వెంటనే చేయాలన్నారు.

యాంటీ బయాటిక్స్‌ వినియోగం వల్లే మరణాలు

రాయదుర్గం: భారతదేశంలో యాంటీ మైక్రోబయల్‌ రెసిస్టెన్స్‌ను ఎదుర్కోవడానికి పరిష్కారాలను గుర్తిస్తూ ఒక నివేదిక విడుదల చేశారు. గచ్చిబౌలిలోని ఇండియన్‌ స్కూల్‌ ఆఫ్‌ బిజినెస్‌(ఐఎస్‌బీ) లోని మ్యాక్స్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ హెల్త్‌కేర్‌ మేనేజ్‌మెంట్‌, సెంటర్‌ ఫర్‌ గ్లోబల్‌ డెవలప్‌మెంట్‌ ప్రత్యేక నివేదికను శుక్రవారం విడుదల చేశారు. సరికొత్త యాంటీబయాటిక్స్‌ యొక్క తక్షణ అవసరం ఉందని నివేదికలో స్పష్టం చేశారు. భారత్‌లో ఏటా ఒక మిలియన్‌ కంటే ఎక్కువ మంది ప్రజల మరణాలు ఆస్పత్రులు, ఇంట్లో యాంటీ బయాటిక్స్‌ యొక్క విస్తృతమైన మితిమీరిన వినియోగం, దుర్వినియోగం వల్లే సంభవిస్తున్నాయన్నారు. కేరళ, మధ్యప్రదేశ్‌, న్యూఢిల్లీ, ఏపీలు మాత్రమే యాంటీమైక్రోబయల్‌ రెసిస్టెన్స్‌(ఏఎంఆర్‌) వ్యాప్తిని అరికట్టడానికి కార్యాచరణ ప్రణాళికను కలిగి ఉన్నాయని నివేదికలో స్పష్టం చేశారు.

హైటెక్స్‌లో అంతర్జాతీయ ఆభరణాల ప్రదర్శన




మాదాపూర్‌: మాదాపూర్‌లోని హైటెక్స్‌ ఎగ్జిబిషన్‌ సెంటర్‌లో శుక్రవారం హైదరాబాద్‌ అంతర్జాతీయ ఆభరణాల ప్రదర్శనను ప్రారంభించారు. దక్షిణ భారతదేశంలోనే ఇది అతిపెద్ద ఆభరణాల ప్రదర్శన అని జంటనగరాల జ్యువెలర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కైలాస్‌ చరణ్‌ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడురోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో దక్షిణ భారతదేశంలోని అన్ని రకాల బంగారు ఆభరణాల మోడల్స్‌ని అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఎగ్జిబిషన్‌లో దాదాపు 250 మంది ఎగ్జిబిటర్‌లు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. అలాగే బంగారం, డైమండ్‌, వెండి, రత్నాలు తయారీ ప్రక్రియలో ఉపయోగించే పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రపరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

వివాహ వార్షికోత్సవం



పటాన్‌చెరు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి, యాదమ్మ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో పటాన్‌చెరును మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు.

శనీశ్వరుడికి పూజలు

పటాన్‌చెరు టౌన్‌: పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు మహేష్‌ మాట్లాడుతూ అమావాస్యతో పాటు శనీశ్వర జన్మదినం సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి శనీశ్వరునికి తైలాభిషేకాలు, అనంతరం రామలింగేశ్వరుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్‌: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. పటాన్‌చెరు ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం..మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన మన్నె శంకరయ్య(60) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 15వ తేదీన రుద్రారం సమీపంలోని హైవేపై ఆటోలో వస్తుండగా సంగారెడ్డి వైపు నుంచి పటాన్‌చెరు వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో శంకరయ్యకు తీవ్రగాయాలయ్యాయి. ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. ఆపై ఉస్మానియాకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు.

తల్లిదండ్రులకు తప్పిపోయిన చిన్నారుల అప్పగింత



మియాపూర్‌: ఇంటి నుంచి తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను మియాపూర్‌ పోలీసులు చేరదీసి వారి తల్లిదండ్రులకు శుక్రవారం అప్పగించారు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జార్ఖండ్‌కు చెందిన పుటాన్‌ నాయక్‌, పూర్ణిమ దంపతులకు ఇద్దరు కూతుళ్లు రుక్మిణీ, రమణీలు ఉన్నారు.జార్ఖండ్‌ నుంచి వచ్చి నగరంలో కూలీ పనులు చేస్తున్నారు. పనుల నిమిత్తం మియాపూర్‌కు ఈ నెల 17న వచ్చారు. ఈ క్రమంలో ఇద్దరు చిన్నారులు న్యూ కాలనీ సమీపంలో తప్పిపోయారు. స్థానికులు చూసి మియాపూర్‌ పోలీసులకు అప్పగించారు. మియాపూర్‌ పోలీసులు యూసూఫ్‌గూడ శిశు విహార్‌లో చేర్పించి సంరక్షణ కల్పించారు.శుక్రవారం పుటాన్‌నాయక్‌, పూర్ణిమలు తమ ఇద్దరు పిల్లలు తప్పిపోయారని మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా శిశువిహార్‌లో ఉన్న పిల్లల ఫొటోలను మియాపూర్‌ పోలీసులు చూపగా వారు తమ పిల్లలేనని గుర్తించి వారి ఆధార్‌ కార్డులు కూడా తల్లిదండ్రులు మియాపూర్‌ పోలీసులకు చూపించారు. దీంతో పోలీసులు తప్పిపోయిన రుక్మిణీ, రమణీలను తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్‌ మళ్లింపు

కూకట్‌పల్లి: ఎన్టీఆర్‌ శత జయంతి ఉత్సవాలను శనివారం కైత్లాపూర్‌లో నిర్వహించనున్న సందర్భంగా 20వ తేదీ (శనివారం) మధ్యాహ్నం 3గంటల నుంచి రాత్రి 10గంటల వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు ట్రాఫిక్‌ పోలీసులు తెలిపారు.

- మూసాపేట నుంచి కేపీహెచ్‌బీ 4వ ఫేజు, హైటెక్‌ సిటీకి వెళ్లే వాహనాలు మూసాపేట క్రాస్‌ రోడ్డు, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ మీదుగా దారి మళ్లించారు.
- అదే విధంగా ఐడీఎల్‌ లేక్‌ నుంచి మాదాపూర్‌, హఫీజ్‌పేట్‌కు వెళ్లే వాహనాలను ఐడియల్‌ జంక్షన్‌, కూకట్‌పల్లి బస్టాప్‌, కేపీహెచ్‌బీ రోడ్డు నం.1 మీదుగా జేఎన్‌టీయూ జంక్షన్‌ వైపు నుంచి మళ్లించనున్నారు.
- హైటెక్‌ సిటీ మీద నుంచి కూకట్‌పల్లి, మూసాపేటకు వచ్చే వారు కేపీహెచ్‌బీ 4వ ఫేజు లోధా అపార్టుమెంట్‌ నుంచి కేపీహెచ్‌బీ రోడ్డు నం.1కు మళ్లించారు.
- అదే విధంగా పర్వత్‌నగర్‌, మాదాపూర్‌ నుంచి మూసాపేట, కూకట్‌పల్లికు వచ్చే వాహనాలు ఎన్‌ఐఏ మీదుగా ఎడమవైపు తిప్పుకొని జేఎన్‌టీయూ క్రాస్‌ రోడ్డు మీదుగా వాహనాలను మళ్లించనున్నారు.
- పర్వత్‌నగర్‌ ఫ్లై ఓవర్‌ బ్రిడ్జిపై సుమారు 7గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.

బీజేపీ నాయకుల పాదయాత్ర

మియాపూర్‌: పాపిరెడ్డి కాలనీ బస్తీవాసులు సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర నాయకులు గజ్జెల యోగానంద్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి డివిజన్‌ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో 51వ రోజు ప్రజా సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో ఏడుగురిని పట్టుకున్నారు. వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా విధించారు.

అలీతలాబ్‌ చెరువు పనుల పరిశీలన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని అలీ తలాబ్‌ చెరువు సుందరీకరణలో భాగంగా 1కోటి 83 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న అలుగు నిర్మాణం, చెరువులో కలుషిత, వ్యర్థ జలాలు కలవకుండా పైపులైన్‌ నిర్మాణ పనులను ఇరిగేషన్‌ అధికారులతో శుక్రవారం స్థానిక కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు సంరక్షణలో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సింగ్‌ , అలుగు నిర్మాణం, చెరువు సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఏఈ రాజీవ్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రతన్‌, డివిజన్‌ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్‌, నాయకులు సత్యనారాయణ, రాఘవేందర్‌ రెడ్డి, బ్రహ్మయ్య, కృష్ణారెడ్డి, మహేందర్‌రెడ్డి, మాధవ్‌, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలుపుతా

- ప్రభుత్వవిప్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- గచ్చిబౌలి డివిజన్‌లో రూ.2.56 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

గచ్చిబౌలి/రాయదుర్గం/శేరిలింగంపల్లి: అన్నిరంగాల్లో శేరిలింగంపల్లిని అగ్రస్థానంలో నిలుపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రభుత్వవిప్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని లక్ష్మివిహార్‌ఫేస్‌–1లో రూ.25 లక్షలతో సీసీరోడ్డు, నానక్‌రాంగూడలో రూ.21 లక్షలతో యూజీడీ పనులు, రాయదుర్గంలో రూ.94 లక్షలతో సీసీరోడ్లు, వినాయక్‌నగర్‌లో రూ.1.05 కోట్లతో సీసీరోడ్ల పనులు, వినాయక్‌నగర్‌లో రూ.11 లక్షల వ్యయంతో చేపట్టే మంజీరా పైప్‌లైన్‌ పనులకు ఆయన గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్‌ కొమిరిశెట్టి సాయిబాబా, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. శేరిలింగంపల్లిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, సీసీరోడ్లు, లింకురోడ్లు, బీటీరోడ్లు, కొత్త రోడ్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులను కేటాయించడం జరిగిందన్నారు. దుర్గంచెరువు, మల్కంచెరువుతోపాటు మిగతా అన్ని చెరువులను సుందరీకరించి పరిసర కాలనీలు,బస్తీల ప్రజలు సేద తీరే ప్రాంతాలుగా దశలవారిగా వాటిని మార్చే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. కాలనీలు,బస్తీలలో పార్కులను థీమ్‌ పార్కులుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మెరుగైన జీవనానికి అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు గణేష్‌ముదిరాజ్‌, రాజునాయక్‌, చెన్నంరాజు, సత్యనారాయణ, జంగయ్యయాదవ్‌, నరేష్‌, వినోద్‌, రమేష్‌గౌడ్‌, వసంతకుమార్‌, విష్ణువర్ధన్‌రెడ్డి, దాసరిగోపి, సతీష్‌, యాదగిరి, జగదీష్‌, అంజమ్మ, మాధవి, ఖాదర్‌ఖాన్‌,రమేష్‌ ,ఆయా కాలనీలవాసులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్‌ సాయిబాబా తదితరులు